క్లుప్తంగా

సన్మానం



వర్ధన్నపేట : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, మురళీధర్‌రావులను మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ అనుబంధ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ శాలువాతో సన్మానించారు. హనుమకొండలోని వాగ్దేవి కళాశాలలో సోమవారం జరిగిన పార్టీ ప్రశిక్షణ అభియాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాంచందర్‌రావు, మురళీధర్‌రావు హాజరు కాగా వారిని శ్రీధర్ తొలుత మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సన్మానించి నియోజకవర్గంలోని రాజకీయాలపై చర్చించారు.

మసీదు కమిటీ అధ్యక్షుడికి..



నర్సంపేట : జామా మసీదు కమిటీ అధ్యక్షుడిగా మీర్జా మసూద్ అలీ బేగ్, కోశాధికారిగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ గులాబుద్దీన్ అయూబ్ ఖాన్ ఎన్నికైన క్రమంలో వారిని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ శాలువాతో సన్మానించి స్వీట్లు తినిపించారు. కార్యవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ వైస్ చైర్మన్ పాలాయి రవికుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కత్తి కిరణ్, గజ్జి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి బైరి మురళి, కార్యదర్శి గిరిగాని రమేశ్, నాయకులు పులుగుల మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుంకుమ పూజ



గీసుకొండ : శ్రావణ మాసం సందర్భంగా మండలంలోని కొమ్మాలలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో భక్తులు శుక్రవారం అమ్మవారి విగ్రహానికి కుంకుమ పూజ చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఫణి, విష్ణు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

పర్వతగిరి : మండలంలోని కల్లెడ ఆర్‌డీఎఫ్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న గుగులోతు సందీప్ 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లాస్థాయి అండర్–18 అథ్లెటిక్స్ పోటీలో 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీల్లో సందీప్ పాల్గొని మొదటి స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో ఈనెల 3, 4 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు నిర్వాహకులు ప్రకటించారు. సందీప్‌ను ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాస్, ఇన్‌చార్జ్ సంతోశ్, జి.రమేశ్, ఏట రాజు, పీఈటీలు వేణు, రవితేజ, ఉపాధ్యాయులు అభినందించారు.

'నిమ్స్' అధికారి రమేశ్‌కు పితృవియోగం



భద్రయ్య (ఫైల్)

గీసుకొండ : హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆస్పత్రి లైజనింగ్ అధికారి డాక్టర్ మార్త రమేశ్‌కు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి భద్రయ్య (78) అనారోగ్యంతో స్వగ్రామమైన మండలంలోని ఎలుకుర్తి హవేలీలో గురువారం రాత్రి మృతి చెందారు. భద్రయ్య అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించగా పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. నిమ్స్ అధికారులు, పలువురు ప్రముఖులు అంత్యక్రియలకు హాజరై రమేశ్‌ను పరామర్శించారు.

నివాళి

నర్సంపేట : స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు తోట భిక్షపతి శుక్రవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి రైతు సమన్వయ సమితి రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల మనోహర్‌రెడ్డి, పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి వెనుముద్దల శ్రీధర్ రెడ్డి, యువజన విభాగం పట్టణ కమిటీ అధ్యక్షుడు రాయిడి దుశ్యంత్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మండల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని ఆత్మహత్య

ఖిలా వరంగల్ : ఫ్యాన్‌కు ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం రాత్రి కరీమాబాద్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం దాసు రవికాంత్ (42) తాగుడుకు బానిసై ఇటీవల భార్యకు విడాకులు ఇచ్చాడు. ఒంటరి తనంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పంటల సాగుకు నీరందేనా..?

- కాల్వల్లో ఏపుగా పెరిగిన గడ్డి, గుర్రపు డెక్క
- శుభ్రం చేయడంలో నిర్లక్ష్యం

నర్సంపేట రూరల్ : ఖరీఫ్ సీజన్ మొదలైంది. సుమారు నెల రోజుల క్రితమే పలువురు రైతులు కాల్వల కిందున్న తమ పంట భూముల్లో నారు పోశారు. ఇటీవల వారం రోజులపాటు కురిసిన వర్షాలకు రైతన్నల్లో ఆశలు చిగురించి నాట్లకు సిద్ధం చేసుకున్నారు.. తీరా నాట్లు వేసే సమయానికి వర్షాలు జాడలేకుండా పోయాయి. పైగా పాకాల చెరువు నుంచి జాలుబంధం కాల్వ ద్వారా నీళ్లు వస్తాయని ఆశించే రైతాంగానికి నిరాశే మిగిలింది. జాలుబంధం కాల్వలో ఏపుగా పెరిగిన గడ్డి, గుర్రపు డెక్క నిండడడంతో పైనుంచి వచ్చే జాలు కూడా రాకుండాపోయే దుస్థితి నెలకొంది. ప్రభుత్వం, అధికారులు కాల్వలను ప్రస్తుత ఖరీఫ్‌లోనైనా శుభ్రం చేయిస్తారా? పంటల సాగుకు నీరందించేనా? అని రైతన్నలు వేదనకు గురవుతున్నారు. ఎమ్మెల్యే, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి కాల్వలను శుభ్రం చేయిస్తే తప్ప ఖరీఫ్‌లో పంటలు సాగయ్యే పరిస్థితి లేదు.

నర్సంపేట డివిజన్‌లో పాకాల సరస్సు అతిపెద్ద చెరువు. చెరువు కింద ఏటా అధికారింగా సుమారు 35–40 వేల ఎకరాల్లో పంట సాగవుతోంది. అనధికారికంగా మరికొన్ని ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. పాకాల నుంచి వచ్చే పస్నూర్, జాలుబంధం పంట కాల్వల ద్వారా నర్సంపేటకు పారకం జరుగుతోంది. కాల్వల్లో గడ్డి విపరీతంగా పెరగడంతోపాటు గుర్రపు డెక్కతో నీరు అందే అవకాశం లేకుండా పోయింది. దీంతో ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు సాగునీటి కోసం వేదనకు గురవుతున్నారు.



జాలుబందం కాల్వలో ఏపుగా పెరిగిన గడ్డి, గుర్రపు డెక్క

రాత్రింబవళ్లు శ్రమించినా..

రెండు కాల్వల కింద సుమారు 5–7 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. లైనింగ్ లేకపోవడంతో కాల్వల్లో ఏపుగా చెట్లు, గడ్డి, గుర్రపు డెక్కతో నీరు దిగువకు రావడం లేదు. దీంతో చివరి ఆయకట్టు రైతులు రాత్రింబవళ్లు శ్రమించినా నీరు పారించలేకపోతున్నారు. నార్లు ఎండిపోయే ప్రమాదం ఉంది. వర్షాలు కురిసి నాట్లు వేసే క్రమంలో కాల్వలు శుభ్రం చేయకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. అడపాదడపా వచ్చే నీటికి అడ్డుకట్ట వేస్తూ మోటార్లతో భూములను పారిస్తూ నాట్లు వేయడం మొదలైంది. ఈ కాల్వను శుభ్రం చేయాలంటే ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్ నుంచి జాలుబంధం కాల్వను జేసీబీతో శుభ్రం చేస్తూ రావాల్సిందే. అలా అయితేనే నీరు సకాలంలో రైతులకు అంది ఖరీఫ్ నుంచి రైతులు పంటలు సాగు చేసే అవకాశాలున్నాయి. ప్రత్యామ్నాయంగా శాశ్వత ప్రాతిపదికన కాల్వలకు లైనింగ్ పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు ఆశిస్తున్నారు.

నీళ్లు రాక ఇబ్బందులు



నర్సంపేటలోని సర్వాపురం శివారులోని జాలుబంధం కాల్వ పారకం కింద నాకు సుమారు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వర్షాలు మొదలుకాగానే నారు పోశా. నాట్లు వేసే సమయానికి వర్షాలు కురవడం కాలేదు. కాల్వ నుంచి నీరు రావడం లేదు. కాల్వలో గడ్డి, నాచు, గుర్రపు డెక్క భారీగా పేరుకుపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి కాల్వను శుభ్రం చేయించాలి.

– సామల ప్రవీణ్, ఆయకట్టు రైతు, నర్సంపేట

శుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ

- పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్ చంద్ర

నర్సంపేట రూరల్ : శుభ్రత పాటించడం ద్వారానే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోగలమని భానోజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్ చంద్ర తెలిపారు. నర్సంపేట శివారులోని సర్వాపురం ఎస్టీ హాస్టల్‌లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. జ్వరాల బారిన పడిన పలువురి రక్తపూత సేకరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి వైద్యాధికారి మాట్లాడారు. భోజనం చేసేందుకు ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, వేడిగా ఉన్నప్పుడే ఆహారాన్ని భుజించాలని, హాస్టల్ పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని సూచించారు. నీటి నిల్వలుంటే దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. జ్వరం, అనారోగ్య సమస్యలు తలెత్తితే సత్వరమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ షేక్ అలీ, సర్వాపురం సబ్ సెంటర్ ఏఎన్‌ఎంలు శ్యామల, కమల, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ అరుణ్ చంద్ర

దేవాదుల నీటితో చెరువులను నింపండి

- బీజేపీ అధికార ప్రతినిధి మహేందర్‌రెడ్డి

వర్ధన్నపేట : దేవాదుల నీటితో వర్ధన్నపేట, ఐనవోలు మండలాల్లోని అన్ని చెరువులను వెంటనే నింపాలని స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి దేవాదుల కెనాళ్లకు నీళ్లు విడుదల చేస్తున్నట్టు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఇటీవల ఫొటోలకు ఫోజులు ఇచ్చారని పేర్కొన్నారు. వాస్తవానికి వర్ధన్నపేట, ఐనవోలు మండలాల్లోని చెరువుల్లో నీరు లేక రైతులు నారు పోసుకున్న వేలాది ఎకరాల పంట భూములు నెర్రెలు బారాయని తెలిపారు. సదరు చెరువులను, భూములను వెంటనే సందర్శించాలని ఎమ్మెల్యేకు సూచించారు. ఈ సంవత్సరం ఆశించిన మేరకు వర్షాలు లేక నియోజకవర్గ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాలు కురుస్తాయని, దేవాదుల నుంచి ప్రభుత్వం చెరువుల్లో నీరు నింపి అందిస్తుందని ఆశించి వరి నాట్లు వేసినా ఎండిపోయే దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. రెండు మండలాల్లోనూ భూగర్భ జలాలు కనిష్ట స్థాయికి చేరుకోగా బోర్లు, బావుల్లోనూ నీళ్లు లేవని వివరించారు. రైతుల సమస్యల పరిష్కారానికి వెంటనే చొరవ తీసుకోవాలని, రైతులకు న్యాయం చేయాలని ఆకాంక్షించారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి అవగాహన కల్పించి చైతన్యవంతం చేసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ తలపెట్టిన జిల్లా పర్యటనను అడ్డుకుని నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

సమాజ ఉన్నతిలో ఉపాధ్యాయులు కీలకం



రమేశ్‌బాబును సతీసమేతంగా సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న ఎంఈఓ, తదితరులు

- ఎంఈఓ లింగారెడ్డి

పర్వతగిరి : సమాజ ఉన్నతిలో ఉపాధ్యాయులు కీలకమని మండల విద్యాధికారి (ఎంఈఓ) గాయపు లింగారెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఏనుగల్ జెడ్పీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్, తెలుగు ఉపాధ్యాయుడు అడ్డూరి రమేశ్‌బాబును ఉద్యోగ విరమణ సందర్భంగా జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ధీకొండ నర్సింహారావు అధ్యక్షతన శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లింగారెడ్డి, రవీందర్‌రెడ్డి అతిథులుగా హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఉపాధ్యాయుడిగా రమేశ్‌బాబు రెండు దశాబ్దాలకుపైగా ఎనలేని సేవలు అందించారని అభినందించారు. అనేక మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సక్కిరెడ్డి మహేందర్, మండల అధ్యక్షుడు భూక్య రాములు, ప్రధాన కార్యదర్శి మేడిది నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యల పరిష్కారంలో విఫలం

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్

నర్సంపేట : సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్ విమర్శించారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పైసా గణేశ్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్టీ హాస్టల్‌ను శుక్రవారం సందర్శించి వసతులు, ఇతర అంశాలపై అధ్యయనం చేశారు. అనంతరం ప్రశాంత్ మాట్లాడారు. హాస్టళ్లలోని టాయిలెట్లు, స్నానాల గదులు అపరిశుభ్రంగా ఉన్నాయని చెప్పారు. నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. గదుల తలుపులు, కిటికీలు, ఫర్నిచర్ దెబ్బతిన్నాయని తెలిపారు. ఫ్యాన్‌లే పని చేయడం లేదని, సరైన గ్రంథాలయ సౌకర్యం లేదని, అత్యవసర వైద్య సహాయం లేదని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్

అనేక సమస్యలు, అరకొర వసతుల నడుమ విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యులు కార్తీక్, శ్యామ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులనే విక్రయించాలి

- ఏడీఏ నర్సింగం

గీసుకొండ : రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులనే విక్రయించాలని వ్యవసాయ శాఖ సహాయక సంచాలకుడు (ఏడీఏ) నర్సింగం కోరారు. మండలంలోని పోతరాజుపల్లి, ఎలుకుర్తి, మొగిలిచర్ల, కొమ్మాల గ్రామాల్లోని పలు ఎరువులు, క్రిమిసంహారక మందుల షాపులను ఏఓ హరిప్రసాద్ బాబుతో కలిసి ఏడీఏ నర్సింగం శుక్రవారం తనిఖీ చేశారు. షాపుల్లోని స్టాక్ రిజిస్టర్లు, ఎరువుల నిల్వలను, ధరల పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడారు. ఎరువులు, పురుగు మందుల విక్రయంలో నిబంధనలు పాటించాలని చెప్పారు. అక్రమాలకు పాల్పడితే సీజ్ చేసి లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులకు అవసరమై యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం పంటల ఆరోగ్య దీపిక పత్రాలను విడుదల చేశారు. ఏఈఓ సంపత్, తదితరులు పాల్గొన్నారు.



షాపులో రికార్డులు పరిశీలిస్తున్న నర్సింగం

ఈకేవైసీ చేయించుకోవాలి

ఆత్మకూరు : ఈజీఎస్ వేతనదారుల తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 15 నుంచి ఉపాధి హామీ పథకంలో పని చేసే యాక్టివ్ వేజ్ సీకర్లకు ఈకేవైసీ చేసేందుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ముఖ గుర్తింపు ద్వారానే రోజుకు రెండు సార్లు హాజరు పంపించడం జరుగుతుందన్నారు. రెండురోజుల్లో లక్ష్యాన్ని ఛేదించే విధంగా మొక్కలు నాటడం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి, ఈసీ రాము, టీఏలు సుధాకర్, సురేశ్, శ్రీధర్ , పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వరినాటు సమయంలో జాగ్రత్తలు పాటించాలి

దామెర : వరినాటు వేసేసమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏడీఏ సోమరాతి శ్రీనివాస్ చెప్పారు. మండలంలోని ఊరుగొండలోని పొలాలను ఆయన శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. నాటు వేసేటప్పుడు నీరుపలుచగా ఉండేలా చూసుకోవాలని, ఏనుకున్న రోజు నుంచి పైరు దుబ్బు చేయడం పూర్తి అయ్యే వరకు పొలంలో 2–3 సెంటీమీటర్లు నీరు ఉండేలా చూడాలన్నారు. చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టిపడే వరకు 5 సెంటీ మీటర్లు నీరు ఉంచుకోవాలన్నారు. నారు కొనలను తుంచడం ద్వారా మొగి పురుగు గుడ్లను తుది దశలోనే నాశనం చేయవచ్చన్నారు. పైరుకు గాలి, వెలుతురు బాగా తాకేలా చర్యలు తీసుకుంటే చీడపీడల ఉధృతి తగ్గుతుందని చెప్పారు.

ఘనంగా ఆటో కార్మికుల దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్ : నర్సంపేట, చెన్నారావుపేట, నెక్కొండ, దుగ్గొండి, రాయపర్తి మండలాల్లో శుక్రవారం ఆటో కార్మికుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆటోకార్మికులు ర్యాలీలు నిర్వహించారు. కేక్‌లు కట్ చేశారు. జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సంపేటలో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, నెక్కొండలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, దుగ్గొండిలో నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఆటోడ్రైవర్లు శ్రమజీవులని చెప్పారు. ప్రభుత్వం ఆటోడ్రైవర్ల సంక్షేమానికి కార్యాచరణ చేపట్టేలా చొరవ తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రయాణికుల పట్ల సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. దుగ్గొండిలో ఎస్సై మహేందర్ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ఫైన్లు, ఇతర ఇబ్బందులకు దూరంగా ఉండాలని సూచించారు. విధుల్లో యూనిఫాం ధరించాలని, పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లవద్దని, తదితర సూచనలు చేశారు. కార్యక్రమాల్లో ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ ఓర్సు తిరుపతి, ఆటో యూనియన్ల నాయకులు ఆకుతోట ఇంద్రసేనారెడ్డి, ఇస్రం కుమార్, కృష్ణారెడ్డి, బండారి సత్యం, తదితరులు పాల్గొన్నారు.



నెక్కొండ : ఆటోర్యాలీని ప్రారంభిస్తున్న టీపీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి, ఎస్సై మహేందర్



నర్సంపేట : కేక్ కట్ చేస్తున్న రామానంద్



దుగ్గొండి : కేక్ కట్ చేస్తున్న ఎస్సై, నాయకులు

రేపటి నుంచి సోషల్ ఆడిట్

నర్సంపేట : మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై రేపటి (ఈనెల 3) నుంచి సోషల్ ఆడిట్ గ్రామ సభలు నిర్వహిస్తామని ఎంపీడీఓ నల్ల శ్రీవాణి, ఉపాధి హామీ ఏపీఓ అరుణ, ఈసీ కిశోర్‌కుమార్, సోషల్ ఆడిట్ ఎస్‌ఆర్‌పీ గంగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3న లింగగిరి, సూర్యాపేటతండాలో, 4న ఉప్పరపల్లి, శంకరంతండా, కోనాపురం, అమృతండా, పుల్లయ్యబోడుతండా, గొల్లభామతండా, కాల్‌నాయక్‌తండా, గొల్లపల్లె, 6న కందిగడ్డతండా, తిమ్మరాయినిపహాడ్, 7న ఎల్లాయగూడెం, పత్తినాయక్‌తండా, ఖాదర్‌పేట, బాపునగర్, 8న జల్లి, లింగాపురం, పాపయ్యపేట, అక్కల్‌చెడ, 16 చింతల్‌తండా, జీడిగడ్డతండా, 10న అమీనాబాద్, తోపనగడ్డతండా, బోడమాణిక్యంతండా, 11న బోజెర్వు, చెన్నారావుపేట, ధర్మతండా, చెరువుకొమ్ముతండా, జోజిపేట, నారాయణతండా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద సభలు ఉంటాయని పేర్కొన్నారు. ఈనెల 12న మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు సోషల్ ఆడిట్ ప్రజావేదిక సభ ఉంటుందని వివరించారు. ప్రజలు, ఉపాధి హామీ కూలీలు హాజరు కావాలని కోరారు.

వివాహిత అదృశ్యం

ఆత్మకూరు : వివాహిత అదృశ్యమైన ఘటన చౌళ్లపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. శాయంపేట మండలం కొత్తగట్టుసింగారం గ్రామానికి చెందిన పెంబర్తి శ్రీజ జూలై 22న చౌళ్లపల్లికి వెళ్లింది. జూలై 24న మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. స్నేహితులు, బంధువుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో శ్రీజ సోదరుడు రోహిత్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ సంతోశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



సరుకులు అందిస్తున్న నాయకులు

రాయపర్తి : మండలంలోని పలు కుటుంబాలను ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం పరామర్శించి బియ్యం, ఆయిల్ క్యాన్‌లు సాయంగా అందజేశారు. పెర్కవేడుకు చెందిన నిమ్మల ఐలయ్య, అద్దపు కృష్ణమూర్తి, అబ్బోజు చంద్రకళ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను కలిసి పరామర్శించి సరుకులు, కొంత నగదు సాయంగా అందజేశారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మెర వీరస్వామి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, లేతాకుల మధూకర్‌రెడ్డి, గజవెల్లి ప్రసాద్, సంకినేని ఎల్లస్వామి, బొడ్డు రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ఉజ్వల భవిష్యత్

- జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ రమేశ్

సంగెం : సాంకేతిక విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్, మండల ప్రత్యేక అధికారి రమేశ్ తెలిపారు. మండలంలోని కాపులకనిపర్తిలోని జెడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కంప్యూటర్ ల్యాబ్‌ను, మధ్యాహ్న భోజనం, బియ్యం స్టాక్, తదితరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థుల పరిజ్ఞానాన్ని పరిశీలించేలా పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం ఆయన మాట్లాడారు. పాఠశాల దశలో కంప్యూటర్ విద్యను బోధించడం అభినందనీయమని తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాము, హెచ్‌ఎం శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల పరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్న రమేశ్

అవగాహనతో సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట



పాటలు పాడుతున్న సుమన్, కళాకారులు

- టీఎస్‌ఎస్ టీమ్ లీడర్ సుమన్

నల్లబెల్లి : అవగాహనతో సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేయొచ్చని తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం టీమ్ లీడర్ నెల్లుట్ల సుమన్ తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో మేడపల్లి, కొండాపూర్ గ్రామాల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించేలా శుక్రవారం కళాజాత నిర్వహించారు. కళాకారులు పాటలు, నాటికల రూపంలో ప్రజలను చైతన్యవంతం చేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. వర్షాకాలంలో డెంగ్యూ, ఇతర విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ప్రజలు వైద్యుల సూచనలు, సలహాలను తూచా తప్పకుండా పాటించాలని కోరారు. కార్యక్రమంలో కళాకారులు తాళ్ల సునీల్, పడిదం రాజేందర్, గాదె పాక బాబు, బరిగెల రవీందర్, ప్రశాంత్, భాస్కర్, నవీన్, శంకర్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.